

ఫీల్డ్ అసిస్టెంట్ విధుల నుంచి తొలగింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని మందస మండలం తల్లాగురంటి పంచాయతీకి చెందిన ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు (ఫీల్డ్ అసిస్టెంట్) నల్ల లోకనాథ చౌదరిని విధుల నుంచి తప్పించినట్లు డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. లోకనాథం రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్లు ఫిర్యాదు రావడంతో స్వయంగా విచారణ చేపట్టిన పలాస రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ భరత్ నాయక్ ధ్రువీకరించారని అన్నారు. ఈ మేరకు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు స్పష్టం కావడంతో విధుల నుంచి తొలగించినట్టు ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు.

అందని వేతనాలు.. తీరని కష్టాలు



సమ్మె సమయంలో ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీలు (ఫైల్)

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీ కార్యకర్తల పరిస్థితి అయోమయంగా మారింది. ముఖ్యంగా జీతాల చెల్లింపు విధానంలో ప్రభుత్వ తీరు వారిని తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. సమ్మె కాలానికి రూ.కోట్ల బకాయిలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని గత ఏడాది డిసెంబరు 12 నుంచి ఈ ఏడాది జనవరి 22 వరకు 42 రోజులకు పైగా అంగన్వాడీ కార్యకర్తలు, మినీ అంగన్వాడీలు, సహాయకులు సమ్మె చేశారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం ప్రత్యక్షం గాను, పరోక్షం గాను అనేక ఆటంకాలు కలిగించారు. కనీస వేతనాలను రూ.26 వేలకు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, డీజిల్, పెట్రోల్, గ్యాస్, ఆర్‌టిసి, ఛార్జీలకు తగ్గట్టు వేతనాలు పెంచాలని డిమాండ్‌తో సమ్మెబాట పట్టారు. వీటికి తోడు అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు సంబంధించిన బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం వల్ల అప్పులపాలవుతున్నట్టు అంగన్వాడీలు గత ఐదేళ్లుగా ఆందోళన చేస్తున్నారు. 2022లోనే సుప్రీంకోర్టు అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు, మినీ సెంటర్లలను తక్షణమే మెయిన్ సెంటర్లుగా మార్చి , మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని దీర్ఘకాలంగా వారు కోరుతున్న సమస్య. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. 5 లక్షలకు పెంచడంతో పాటు పెన్షన్ కావాలని వారి ప్రధాన డిమాండ్లు. వాటిని సాధించుకునేందుకు సమ్మె చేస్తే... ప్రభుత్వం చర్చలకు పిలిచి సమ్మెను విరమించి సహకరించాల ని కోరింది. కొన్ని సమస్యలైనా పరిష్కారమవుతాయని భావించి చర్చల ప్రతినిధులపై నమ్మకంతో సమ్మెను విరమించారు. సమ్మె విరమణ అనంతరం సమస్యల పరిష్కారానికి వేచి చూడాల్సిన దుస్థితి ఎదురైంది. అసలే అరకొర జీతాలతో నెట్టుకొస్తున్న అంగన్వాడీలకు సమ్మె కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. సమ్మె కాలానికి వేతనం చెల్లిస్తామని ఇటీవల ఉత్తర్వులు జారీ చేసినా, ఎప్పటికి జమవుతాయో? తెలియని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4086 అంగన్వాడీ కేంద్రాలుండగా, కార్యకర్తలు 4013 మంది, సహాయకులు 3916 మంది విధులు నిర్వహిస్తున్నారు. సమ్మె కాలంలో 42 రోజులకు వీరికి వేతనాలు చెల్లించలేదు. మార్చి నెల వేతనాల్లో కూడా సమ్మె కాలాన్ని లెక్కిస్తూ కోతలు పెట్టారు. సమ్మె కాలానికి వేతనాలు చెల్లిస్తామని చర్చల సమయంలో అంగీకరించిన ప్రభుత్వ పెద్దలు ఈ వేతనాలను చెల్లించకుండా ఎన్నికల కోడ్‌కు ఒక్క రోజు ముందు జీవో విడుదల చేశారు. దీంతో కేంద్రానికి వచ్చే లబ్ధిదారులకు అవసరమైన ఆహారాన్ని అందించేందుకు కూరగాయలు, గ్యాస్, తదితరాలకు అప్పులు చేయాల్సి వస్తోందని అంగన్వాడీలు వాపోతున్నారు. దీనికి తోడు కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. ఆది నుంచీ అంగన్వాడీలకు అవస్థలు ఎదురవుతున్నాయి. నెలనెలా వేతనాలు అందుకున్న దాఖలాలు లేవు. ముఖ్యంగా సమ్మె తర్వాత కక్షసాధింపు ధోరణి పెరిగింది. అధికారుల పర్యవేక్షకూ ఎక్కువైంది. గతంలో సెలవు అవసరమైతే సూపర్‌వైజర్లు మంజూరు చేసేవారు. సమ్మె అనంతరం సెలవుల మంజూరు కష్టంగా మారిందని, పనిభారం పెరగడంతో పాటు యాప్ బాధ తప్ప లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్వాడీలకు, సహాయకులకు ఈ నెల వేతనంలో మూడు రోజుల జీతం మినహాయించి ఖాతాల్లో జమచేశారని ఆవేదన చెందుతున్నారు.

ఎచ్చెర్ల సీటు బిజెపికే

- అభ్యర్థిగా ఎన్.ఈశ్వరరావు ఖరారు
- భగ్గుమన్న 'కళా' వర్గీయులు



ఈశ్వరరావు

ఎచ్చెర్ల టిక్కెట్ బిజెపికే ఖరారైంది. బిజెపి విజయనగరం పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) పోటీ చేయనున్నారు. దీంతో ఇప్పటి వరకు ఈ సీటుపై ఆశపెట్టుకున్న కళావెంకటరావు గ్రూపు నాయకులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఎన్ఇఆర్‌కు సామాజిక తరగతి బలం లేదని, గతంలో భూ ఆక్రమణ కేసులు ఉన్నాయని టిడిపి నాయకులు పార్టీ అధిష్టానానికి చేసిన ఫిర్యాదులు ఫలించలేదు. అయినా బిజెపి అధిష్టానం ఎన్ఇఆర్‌కే సీటును కేటాయించింది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకం టిడిపికి తలనొప్పిగా మారింది. జిల్లాలో బిజెపికి ఎక్కడ టిక్కెట్ ఇస్తే అక్కడ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పరిస్థితి నెలకొంది. తొలుత శ్రీకాకుళం సీటును బిజెపికి ఇచ్చారంటూ ప్రచారం సాగింది. నియోజకవర్గంలో బిజెపి నాయకులు కుమ్ములాటలు, ఫిర్యాదుల ఫలితంగా శ్రీకాకుళం స్థానాన్ని వదులుకొని ఎచ్చెర్ల సీటును కోరుకుంది. ఆ నియోజకవర్గంలో ముఖ్య నాయకులుగా ఉన్న ఈశ్వరరావు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరితో చేసిన లాబీయింగ్ ఫలితంగా ఆ సీటును దక్కించుకున్నట్లు తెలిసింది. ఎచ్చెర్ల నియోజకవర్గం శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలోకే వచ్చిందంటూ కేంద్ర పార్టీ పెద్దలను తప్పుదోవ పట్టించారని జిల్లాకు చెందిన నాయకులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా చివరకు ఎన్ఇఆర్ పేరునే కేంద్ర పార్టీ ఖరారు చేసింది.

భగ్గుమన్న 'కళా' వర్గీయులు

ఎచ్చెర్ల సీటు ఎన్ఇఆర్ ఖరారు కావడంతో మాజీ మంత్రి కళావెంకటరావు వర్గీయులు భగ్గుమంటున్నారు. ఇప్పటి వరకు తమ నేతకే సీటు వస్తుందని ఆశలు పెట్టుకున్న నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరాశకు లోనయ్యారు. భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

బిజెపి అభ్యర్థిపై టిడిపి అభ్యంతరం

ఎచ్చెర్ల సీటు బిజెపికి కేటయించడంపై టిడిపి శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. బిజెపి అభ్యర్థిగా ఎన్ఇఆర్‌ను ప్రకటించడంపై వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్ఇఆర్‌ను తప్పించడానికి చంద్రబాబుకు టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. కాపులు ప్రాబల్యం ఉన్న ఎచ్చెర్ల నియోజకర వర్గంలో కమ్మ తరగతికి చెందిన ఎన్ఇఆర్‌కు బలం అంతగా లేదని, గెలుపు కష్టమని టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో పాటు టిడిపి హయాంలో భూ ఆక్రమణలను సైతం అధిష్టానం దృష్టికి నాయకులు తీసుకెళ్లారు.

ఎన్ఇఆర్‌కి కష్టమే?

గత ఎన్నికల్లో ఎచ్చెర్ల నియోజకవర్గంలో బిజెపికి డిపాజిట్లు కూడా దక్కలేదు. నియోజకవర్గంలో బిజెపి కేడర్ చాలా బలహీనంగా ఉంది. దీంతో పాటు సామాజిక తరగతి బలం కూడా లేకపోవడంతో ఎన్ఇఆర్ గెలిచే పరిస్థితి లేదని టిడిపి నాయకులే చెబుతున్నారు. కళావెంకటరావుకు టిక్కెట్ దక్కకపోవడంతో టిడిపి కేడర్ ఎంతవరకు సహకరిస్తుందోనని సందేహంగా ఉంది. మొత్తంమీద ఆ సీటులో ఎన్ఇఆర్ గట్టెక్కడం చాలా కష్టమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎం.కె మీనా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల ఫిర్యాదులు తక్షణం పరిష్కరించాలని, అన్ని ప్రచార అనుమతులు నిర్దేశిత సమయంలో అందజేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సి-విజిల్ యాప్, ఇఎస్ఎంఎస్ ఫిర్యాదులు, ఎంసిసి, ఫిర్యాదుల పరిష్కారం, ఎన్నికల సన్నద్ధత, తదితర అంశాలపై కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం-7, 8ల పరిష్కారం, రాజకీయ పార్టీలకు అనుమతులను సకాలంలో ఇవ్వాలని, సివిజిల్ ద్వారా అందే ఫిర్యాదును సకాలంలో పరిష్కరించడం, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పటిష్టంగా అమలుపరచాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణలో భాగంగా చేపడుతున్న చర్యలను వివరించారు. ఫిర్యాదుల పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. సమావేశంలో జెసి ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్‌డిఒలు భరత్‌నాయక్, దొర, సిహెచ్.రంగయ్య, లక్ష్మణమూర్తి, అప్పారావు, రామ్మోహన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, సిహెచ్.రంగయ్య, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



వీసిలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ముందస్తు అనుమతులు తప్పనిసరి

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల ప్రచారాలకు భారత ఎన్నికల సంఘ నియమ నిబంధనల మేరకు అయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ముందస్తు అనుమతి పొందాలని జెసి ఎం.నవీన్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో 39వ వారపు సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రచారాలు, ఇతర అనుమతులకు సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల వద్ద తప్పక అనుమతి పొందాలన్నారు. అనుమతి లేకుండా ప్రచార కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాయకుల ర్యాలీలు, స్టార్ క్యాంపెయిన్, రోడ్ షో లాంటి కార్యక్రమాలకు 48 గంటల ముందే అనుమతి తీసుకోవాలన్నారు. డోర్ టూ డోర్ ప్రచారానికీ అనుమతి తప్పక ఉండాలన్నారు. వారం వారం షెడ్యూల్ రూపొందించుకుని దరఖాస్తులు చేసుకోవడం ద్వారా ముందస్తు అనుమతులు పొందవచ్చన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సంసిద్ధం చేశామని, జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జిల్లా వ్యాప్తంగా మోడల్ కోడ్ ఉల్లంఘన చర్యలపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టామని తెలిపారు. ఏడాదిన్నర కాలంలో కొత్తగా 2,84,705 ఓటరు గుర్తింపు కార్డులను ముద్రించామని వాటిలో 98 శాతం పంపిణీ పూర్తి చేశామన్నారు. జిల్లాలోని 2357 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణ కోసం బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్లు 150 శాతం అందుబాటులో ఉన్నాయన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఎన్నికల నామినేషన్ వరకూ ఫారం-6 అభ్యర్థనలు స్వీకరిస్తామని, ఇకపై ఓటర్ల జాబితాలో తొలగింపులు ఉండబోవని స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం అభ్యర్థులు ప్రచార నిమిత్తం వినియోగించే బ్యానర్లు, జెండాలు, టోపీలు, వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించే అడ్వర్టైజ్మెంట్లకు సంబంధించిన రేటింగ్ కార్డు కూడా అందజేస్తామని చెప్పారు. పార్టీ అభ్యర్థులు అనుమతి తీసుకున్న ప్రకారమే ఖర్చు చేయాలన్నారు. యంసిసి, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో వ్యూయింగ్ టీం, తదితర టీములు జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షిస్తున్నాయని అన్నారు. నిష్పక్షపాతంగా విధులు నిర్వహించేలా సూచనలను ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, రట్టి ప్రకాశరావు (సిపిఎం), రౌతు శంకరరావు (వైసిపి), పి.ఎం.జె.బాబు (టిడిపి), సురేష్ సింగ్ (బిజెపి), దేసెళ్ల గోవింద మల్లిబాబు (కాంగ్రెస్), ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న జెసి నవీన్

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి

ఎస్‌పి జి.ఆర్ రాధిక

వజ్రపుకొత్తూరు: సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీసులకు ఆదేశించారు. మండలంలోని అక్కుపల్లి, బైపల్లి పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. మారుమూల ప్రాంతాల్లో ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లోని వసతులపై ఆరా తీశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఫ్లైయింగ్ స్క్వాడ్‌కి ఆదేశించాఉ. ఎటువంటి డాక్యుమెంట్ లేకుండా ఎవరైనా నగదుతో పట్టుబడితే వాటిని స్వాధీనం చేసుకొని ఎన్నికల నిబంధనలకు అనుసరించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈమెతో పాటు కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి, రూరల్ సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సిహెచ్.రామారావు, ఎఎస్ఐ జిన్నారావు ఉన్నారు.



వజ్రపుకొత్తూరు : సూచనలు ఇస్తున్న ఎస్‌పి రాధిక

పోలింగ్ కేంద్రం పరిశీలన

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి తాళభద్ర పోలింగ్ కేంద్రాన్ని ఎస్‌పి జి.ఆర్.రాధిక బుధవారం పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. అనంతరం పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు ఉన్నాయా? లేవా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ పారినాయుడు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఈశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా బార్ అసోసియేషన్ నూతన కార్యవవర్గ ఎన్నిక బుధవారం ఉత్కంఠభరితంగా సాగాయి. అధ్యక్షునిగా న్యాయవాది కిలారు ఈశ్వరరావు ఎన్నికయ్యారు. ఆయన ప్యానల్‌లో ఉన్న యగళ్ల ప్రసన్న ప్రధాన కార్యదర్శి, పీస చంద్రశేఖర్ జాయింట్ సెక్రటరీ, విరోధి శ్రీనివాస్ ట్రెజరర్‌గా, కారి అప్పారావు స్పోర్ట్సు ప్రతినిధిగా, మహిళా ప్రతినిధిగా మజ్జి అమృత ఎన్నికయ్యారు. ఈశ్వరరావు 64 ఓట్ల మెజారిటీతో తన సమీప అభ్యర్థి కోన రాజారావుపై విజయం సాధించారు. అలాగే కార్యదర్శిగా పి.చంద్రశేఖరరావు 13 ఓట్ల మెజారిటీతో అభ్యర్థి ఎం.భవానీప్రసాద్‌పై గెలుపొందారు. అలాగే ఇతర ప్రధాన కార్యదర్శి మొదలగు పోస్టులకు గతంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ ఎన్నికపై పలువురు సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు వ్యక్తం చేశారుఎన్నికల అధికారులుగా కె.నాగభూషణం, గేదెల వాసుదేవరావులు వ్యవహరించారు. ముచ్చటగా మూడోసారి అధ్యక్ష స్థానానికి పోటీపడిన ఎన్ని సూర్యారావు ఈసారి మూడో స్థానాన్ని దక్కించుకున్నారు.



ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులు

ఇవిఎంల భద్రతపై సమీక్ష



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఇవిఎం గోదాములను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి బుధవారం తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా అక్కడి భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. గోదాములను తెరిపించి నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన బ్లాకులను, ఇవిఎంలను పరిశీలించారు. గోదాముల్లోని సిసి కెమెరాలను తనిఖీ చేశారు. అనంతరం మళ్లీ గోదాములకు సీళ వేయించారు. వీడియో ఫుటేజీని పరిశీలించారు. ఇవిఎంల తొలిదశ తనిఖీకి ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘానికి ఈ తనిఖీల సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. ఈ తనిఖీల్లో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్ఒ ఎం.గణపతిరావు, నోడల్ అధికారి సుధ, వైసిపి నుంచి రౌతు శంకరరావు టిడిపి నుంచి పి.ఎం.జె.బాబు, సురేష్ సింగ్, డిటి చక్రవర్తి పాల్గొన్నారు.

అనాధలకు ఆర్థికసాయం

ఆపదలో ఉన్న కుటుంబాన్ని ఆదుకొని మానవత్వాన్ని చాటుకోవటం అభినందనీయమైన విషయమని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది రూ.లక్ష సేకరించి ఇద్దరు అనాథ పిల్లల పేరున పోస్టల్‌లో డిపాజిట్ చేశారు. ఆ డిపాజిట్ పుస్తకాలను కలెక్టరేట్‌లో కలెక్టర్ బుధవారం అందజేశారు. అనాధ అయిన సాయి శరత్ ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడు, ఆయన సోదరుడు దుర్గాప్రసాద్ శ్రీకాకుళంలో చదువుతున్నాడు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు కొండేటి శంకరరావు, ఝాన్సీరాణిలను కోల్పోయారు. తల్లిదండ్రులను కోల్పోయిన ఆ చిన్నారులకు ఆదుకోవాలన్న ఆలోచనతో ఉపాధ్యాయులు పారుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యాన విరాళాన్ని సేకరించారు.



ఆలయంలో ఉన్న ఎలుగు

ఎలుగు సంచారం


ప్రజాశకి- పలాస

ఉద్దాన ప్రాంతం జీడి తోటల్లో ఎలుగు సంచారం చేయడంతో ఉద్దాన ప్రాంత ప్రజలతో పాటు జీడి రైతులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా కంటిపై కునకులేకుండా చేస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల వజ్రపుకొత్తూరు మండలం అనకాపల్లిలో ఇద్దరు రైతులు ఎలుగు దాడిలో మృతి చెంది... వారం రోజులు గడపకు ముందే మండలంలోని మామిడిపల్లి జీడి తోటలో ఎలుగు సంచరిస్తుంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం జీడి తోటలో ఉన్న అమ్మవారి ఆలయం వద్ద ఎలుగు సేద తీరుతుంది.

స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్ : ప్రతి వ్యక్తీ సన్మార్గంతో నడుస్తూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని బ్యాంకర్స్ కాలనీలోని సత్యసాయి మందిరంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఆధునికపోకడలతో పెడదారిన పడుతున్న యువతను సన్మార్గంలో నడిపించడానికి సేవాభావం ఉన్న సత్యసాయి సంస్థలు కృషి చేస్తున్నాయని, వాటిని సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. స్కిల్స్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్మన్ మామిడి శ్రీకాంత్, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ రావాడ వెంకటరామన్, వైసిపి నాయకులు మండవిల్లి రవి, అంధవరపు ప్రసాద్, సంతోష్, బిఆర్ఎయు మాజీ ప్రిన్సిపాల్ గుంట తులసీరావు, సత్యసాయి మందిర కన్వీనర్ అల్లాడ ప్రసాదరావు, డోకి జనార్ధరరావు, ఉరిటి చిట్టిదాస్, మోనింగి మురళీమోహనరావు, కోరాడ గుప్త, ప్రమీల, సుజాత, దివ్య, మణిమాల, సుమ, యామిని, ప్రసాదరావు, సుధ పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య



లావేరు: తన భార్య వేరొకరితో అక్రమ సంబంధం పెట్టుకొని తనపై అక్రమ కేసులు పెట్టి నిత్యం వేధింపులు గురిచేసేదని, దీంతోపాటు తనతో అక్రమ సంబంధం పెట్టుకున్న వారితో కలిసి నాపై దాడి చేయించిందని, దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నానని ఓ యువకుడు సెల్ఫీ వీడియో విడుదల చేసి ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన లావేరు మండలం బెజ్జిపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పొట్నూరు కాంతి కిరణ్ (39) బుధవారం సాయంత్రం ఇంట్లో ఉన్న ఫ్యాన్ కొక్కానికి ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించారు. తన భార్య గ్రామానికి చెందిన వేరొక వ్యక్తితో పాటు తన కన్నవారి గ్రామంలో మరోవ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో తీవ్ర మనస్తాపనకి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నానని వీడియోలో చెప్పారు. తన భార్య చెడు తిరుగులకు కన్నవారు వత్తాసు పలికారని వాపోయాడు. నాకీ పరిస్థితి తీసుకొచ్చిన భార్య, అత్తమామలు అక్రమ సంబంధం పెట్టుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సెల్ఫీ వీడియోలో రికార్డు చేసి తన స్నేహితులకు పంపించాడు. నా చావుకు కారణమైన ఏ ఒక్కరినీ విడిచి పెట్టొద్దని విన్నవించాడు. వారందరికీ శిక్ష పడే విధంగా చూడాలని కోరారు. మృతునికి మోక్షిత, శ్రావ్య అనే ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఈ ఘటనపై లావేరు పోలీసులను సంప్రదించగా కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సిహెచ్.స్వామినాయుడు తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి- పొందూరు

ప్రజాస్వామ్యంలో అత్యంత బలమైన ఓటు అనే ఆయుధాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెసి, ఆముదాలవలస నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్ అన్నారు. మండల కేంద్రంలో ఓటు ప్రాధాన్యతపై బుధవారం 2కె రన్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఓటుహక్కును విధిగా వినియోగించుకోవాలని సూచించారు. ముందుగా ఉదయం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు 2కె రన్ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.పాల్‌కిరణ్, ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ, ఎంఇఒలు రామరాజు, రాజారావు, మండలస్థాయి అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : స్వచ్ఛమైన ప్రజాస్వామ్యం పరిరక్షణకు ఓటే వజ్రాయుధమని ఎపిఎం పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని కొర్లకోట, హనుమంతపురం గ్రామాల్లో ఓటు హక్కు వినియోగంపై బుధవారం అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వయోజనులంతా తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు వంద శాతం తమ కుటుంబ సభ్యులతో పాటు, స్వయంశక్తి సంఘాలు, గ్రామ సంఘాల్లో అర్హత గల వారందరినీ ఓటర్లుగా చేర్పించి పోలింగ్ రోజున ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ రమణ, విఒఎలు వనజాక్షి, రాజులమ్మ పాల్గొన్నారు.

నందిగాం: నందిగాం నుంచి కణివూరు వరకు ఎంపిడిఒ జి.శివప్రసాద్ ఆధ్వర్యాన ఓటు హక్కుపై బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శించి ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వి.పద్మావతి, డిటి భాగ్యలక్ష్మి, ఇఒపిఆర్‌డి రాజారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : మండలంలోని గోనెపాడు, మూలసవలాపురం గ్రామాల్లో ఎపిఎం కమల ఆధ్వర్యాన మండల సమాఖ్య మహిళలతో ఓటు హక్కు వినియోగంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులు ప్రతిజ్ఞ చేశారు.

కవిటి: ఎపిఎం గోవిందరావు ఆధ్వర్యాన ఓటు హక్కు వినియోగంపై ప్రభుత్వాస్పత్రి కూడలి నుంచి బస్టాండ్ వరకు అధికారులు ర్యాలీ, మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో విఆర్ఒలు నారాయణరావు, ప్రశాంతి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పొందూరు : మానవహారంలో పాల్గొన్న జెసి నవీన్



నందిగాం : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



పార్టీలో చేరిన వారితో రామ్మోహన్ నాయుడు, శిరీష

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పలాస

టిడిపి కార్యాలయంలో మందస మండలం లోహరిబంద పంచాయతీ కొత్తూరు, గొల్లలపాలెం నుంచి బుధవారం ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష సమక్షంలో వైసిపి నుంచి 72 కుటుంబాలు టిడిపిలో చేరారు. వారికి రామ్మోహన్ నాయుడు, గౌతు శిరీష పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ, శిరీష మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో పలాస నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. మండల గణపతి, మదిమింది వెంకటరావు, అందాల గణపతి, అందాల జానకిరావు, సార కేశవరావు తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, దాసరి తాతారావు, జి.కె.నాయుడు, లింగరాజు, రుద్రయ్య, నవీన్ పాల్గొన్నారు.

వీసి రజనికి సత్కారం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజనిని తన మాతృ విభాగమైన ఆంధ్రా విశ్వవిద్యాలయ ఫిలాసఫీ అండ్ రెలిజియస్ స్టడీస్ శాఖ బుధవారం ఘనంగా సత్కరించింది. ఈ విభాగం, బెంగుళూర్ ఎనిటియస్ అకాడమీ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ సంయుక్త నిర్వహణలో ధార్మిక విజ్ఞాన పరిణామం, ప్రాచీన సంప్రదాయాలపై ఆధునిక దృక్పథాలు అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సమావేశంలో ఆచార్య కె.ఆర్.రజని కీలకోపన్యాసం చేశారు. మానవ సమాజంలో మత విశ్వాసాలకంటే మానవతా దృక్పథం నెలకొల్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తన పూర్వ విభాగం చేసిన సత్కారం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. బెంగుళూర్ ఎనిటియస్ అకాడమీ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ సిఇఒ సంతోష్ జ్ఞానకర్ ప్రసంగిస్తూ తన తండ్రి నెలకొల్పిన యాక్స్ అకాడమీ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతుందని, ఈ క్రమంలో తమ అకాడమీ ఆంధ్ర యూనివర్సిటీతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవటం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థుల్లో పరిశోధనా సామర్థ్యం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ యూనివర్సిటీల ప్రిన్సిపాళ్లు, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డిఎస్‌పి

పకడ్బందీగా తనిఖీలు

ప్రజాశక్తి- బూర్జ

చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలను పకడ్బందీగా నిర్వహించాలని శ్రీకాకుళం డిఎస్‌పి వై.శ్రుతి అన్నారు. బుధవారం మదనాపురం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను ఆమె సందర్శించారు. ఆర్‌ఎస్‌ఎఫ్, పోలీసులకు తాత్కాలిక నివాసం కోసం ఏర్పాటుచేసిన రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. వాహనాల తనిఖీల్లో రాజకీయ నాయకుల నుంచి ఎటువంటి ఒత్తిళ్లు వచ్చినా విడిచిపెట్టకుండా మద్యం, నగదు వంటి అక్రమ సరఫరాలకు అడ్డుకట్ట వేయాలని ఆమె ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించి పోలీస్‌శాఖ పని చేయాలన్నారు. అలాగే గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఆమెతో పాటు ఆముదాలవలస సిఐ దివాకర్, బూర్జ ఎస్ఐ జి.వి.ప్రసాద్, పోలీసులు ఉన్నారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పించిన సిపిఎం నాయకులు

సిపిఎం నాయకుల సంతాపం

వజ్రపుకొత్తూరు : సిపిఎం సానుభూతిపరుడు నెయ్యిల సూర్యనారాయణ(78) మృతికి పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. బుధవారం నగరంపల్లిలో మృతుని ఇంటివద్ద ఆయన చిత్రపటానికి ఎస్.చంద్రయ్య పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బి.ఆనందరావు, ఎన్.మోహనరావు మాట్లాడుతూ నెయ్యిల వృత్తిదారుల హక్కులు, సమస్యలపై జిల్లాస్థాయి సంఘ ఏర్పాటులో నెయ్యిల చిన్నారావుతో పాటు సూర్యనారాయణ ఒక ప్రధాన బాధ్యుడుగా నిలబడ్డారని కొనియాడారు. సిపిఎం, ప్రజాసంఘాలు నిర్వహించిన పోరాటాల్లో ఆయన చురుగ్గా పాల్గొనేవారన్నారు. ఆయన మృతి పార్టీకి ప్రజాసంఘాలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో ఎంవి కామేశ్వరరావు, కె.ఎర్రయ్య, ఎస్. మహాలక్ష్మి, బైరాగి, మల్లేసు, కుటుంబ సభ్యులు జోగారావు, వెంకటరావు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిని అభ్యర్థిగా ప్రకటించాలి

శ్రీకాకుళం అర్బన్ : టిడిపి అధిష్టానం శ్రీకాకుళం అభ్యర్థిని పునః పరిశీలన చేసి లక్ష్మీదేవి టిక్కెట్ ఇవ్వాలని టిడిపి నగర పార్టీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ కోరారు. అరసవల్లిలోని లక్ష్మీదేవి నివాసం వద్ద బుధవారం విలేకరులతో మాట్లాడారు. క్రమశిక్షణ గల క్యాడర్ నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఐవిఆర్‌ఎస్ సర్వే నిర్వహించడాన్ని తాము స్వాగతిస్తున్నామని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ గుండ దంపతులను కలిసిన అనంతరం ఐవిఆర్ఎస్ సర్వే నిర్వహించడంతో పునఃపరిశీలన జరుగుతుందన్న నమ్మకం కలుగుతోందన్నారు. గుండ కుటుంబానికి టిక్కెట్ కేటాయించకపోవడాన్ని పార్టీ కేడర్ జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు మద్దాల కృష్ణమూర్తినాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు తోనంగి వెంకన్నయాదవ్, జామి భీమశంకర్, వమ్మరవల్లి చిన్న, బుక్కా యుగంధర్ పాల్గొన్నారు.

27 మంది రక్తదానం

శ్రీకాకుళం అర్బన్ : సినీ నటులపై అభిమానాన్ని పెంచుకుని వాటి కోసం నిరంతరాయంగా సేవా కార్యక్రమాలు చేపట్టడంలో మెగా అభిమానులు కృషి ప్రశంసనీయమని వైద్యులు డానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని లయన్స్ క్లబ్ బ్లడ్ బ్యాంకులో సినీనటుడు రాంచరణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా బుధవారం 27 మంది అభిమానులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానంపై ప్రజల్లో విశ్వసనీయతను పెంచిన ఘనత చిరంజీవికే దక్కుతుందన్నారు. ఆయన నెలకొల్పిన బ్లడ్ బ్యాంకు ఉమ్మడి రాష్ట్రంలో లక్షల మందికి రక్తాన్ని అందించిందని గుర్తు చేశారు. సినీ నటులుగా ఆయన కుటుంబం నుంచి వచ్చిన నటుల పుట్టిన రోజు వేడుకల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రక్తదానం చేసిన యువతను ఆయన ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, రామ్‌చరణ్ అభిమానులు గురుప్రసాద్, ఉదయ్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న రామ్‌చరణ్ అభిమానులు

వైసిపి ఇంటింటా ప్రచారం



పోలాకి : ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్



లావేరు : ప్రచారం నిర్వహిస్తున్న పరిమళ

పోలాకి: మండలంలో వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఎ ధర్మాన కృష్ణదాస్ బుధవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మబుగాం, తలసముద్రం, రాళ్లపాడు, ఈదులవలస జంక్షన్, వెదుళ్లవలస, పోలాకి, సుసరాం తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణదాస్, ఎంపి అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ధర్మాన రామదాసు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, వైసిపి నాయకులు దుంపల భాస్కరరావు, కణితి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: ఎమ్మెల్యేగా మరోసారి గొర్లె కిరణ్ కుమార్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే సతీమణి, రణస్థలం మాజీ ఎంపిపి గొర్లె పరిమళ కోరారు. బుధవారం లావేరులో ఇంటింటా ప్రచారం నిర్వహించి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: కిడిసింగి, శారదాపురంలో వైసిపి నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్ మళ్లీ అధికారంలోకి రావడానికి సహకరించాలని కోరారు. అదేవిధంగా బాతుపురం పంచాయతీ పరిధిలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమాల్లో ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పి.గురయ్యనాయుడు, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, సర్పంచ్‌లు నర్తు లక్ష్మీనారాయణ, బత్తిన లక్ష్మీనారాయణ, జోగి అప్పారావు, మాజీ ఎంపిటిసిలు ఇరోతు హేమంతరాజు, నర్తు ప్రేమ్‌కుమార్, మాజీ సర్పంచ్ నర్తు శేషయ్య, పిఎసిఎస్ డైరెక్టర్ బగాది హరికృష్ణ, పైల అప్పారావు, దువ్వాడ ఉమామహేశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.



ఆముదాలవలస : ప్రచారంలో చేస్తున్న శ్రీనివాసరెడ్డి, రవికుమార్

'సూపర్ సిక్స్'పై ప్రచారం

ప్రజాశక్తి- ఆముదాలవలస

టిడిపి, జనసేన, కూటమితో జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని టిడిపి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కో-ఆర్డినేటర్ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం సరుబుజ్జిలి మండలంలోని షలంత్రిలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ నిర్వహించిన శంఖారావం కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నిన్నటి వరకు వై నాట్ 175 అన్న జగన్ రెడ్డి ఎన్‌డిఎ కూటమి దెబ్బకు తాడేపల్లి ప్యాలెస్ వదిలి బస్సుయాత్రతో ప్రజలను మభ్యపెట్టడానికి బయలు దేరారన్నారు. కార్యక్రమంలో కిల్లి సిద్ధార్థ, లావేటి పూర్ణారావు, నందివాడ గోవిందరావు, తాడేల రాజారావు, పైడి మురళీమోహన్, గణపతిరావు, కొర్ను సూర్యనారాయణ, మీసాల రామారావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలిలో టిడిపి అభ్యర్థి మామిడి గోవిందరావు ప్రచారం నిర్వహించారు. గ్రామ సీనియర్ నాయకులు మాలతి ఢిల్లేశ్వరరావు, విజయ్ కుమార్, మాజీ ఎంపిటిసి కోట తిరుపతిరావు, జనసేన నాయకులు ఎల్.వాసు, షణ్ముఖరావు, వెంకటరావులను కలిసి తనకు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సలాన మోహనరావు, ఎంపిటిసి ప్రతినిధి వెంకటరావు, మాజీ ఎంపిటిసి ఎస్.ఎల్లం నాయుడు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

పోటీ పరీక్షలకు స్పందన ఫౌండేషన్ తరుపున విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు స్పందన ఫౌండేషన్ సభ్యులు షణ్ముఖరావు, భూషణ్‌రెడ్డి, సిమ్మన్న, ఫాల్గుణరెడ్డి, శివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బడేకుప్పన్నపేట కార్యస్థానంగా పనిచేస్తున్న కెపి స్పందన ఫౌండేషన్ నాలుగేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తుందన్నారు. దానిలో భాగంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యా ఫలాలు అందివ్వాలని తలచి తల్లిదండ్రులు లేని, ఆసరా లేని పేద విద్యార్థులకు, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎపిఆర్‌జెసి, పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనుని చెప్పారు. వారి ప్రవేశ పరీక్షల ప్రవేశ రుసుమూ తామే భరిస్తామని తెలిపారు. కోచింగ్ ఈ నెల 28 నుంచి కొత్తపేట విక్టరీ కాలేజ్ ప్రాంగణంలో ప్రారంభమవుతుందని అన్నారు. విద్యార్థులు 9912331527 నంబరును సంప్రదించాలని సూచించారు.

వైసిపిలో పలు కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలం మేఘవరం పంచాయతీ కోదండ౦పురంకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలతో పాటు 100 కుటుంబాలు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో బుధవారం వైసిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్సీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కొర్రాయి సూర్యనారాయణ, గంట సుందరరావు, గంట నాగేశ్వరరావు, యాళ్ల రామారావు, కృష్ణారావు ఉన్నారు.

బార్ అధ్యక్షునిగా శ్రీనివాస్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి



శ్రీనివాస్

స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అధ్యక్షుడుగా సీనియర్ న్యాయవాది లఖినేని శ్రీనివాస్‌ను బుధవారం న్యాయవాదులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా బమ్మిడి నారాయణరావు, సెక్రటరీగా ఉప్పాడ తిరుమలరావు, జాయింట్ సెక్రటరీగా వెంకటరావు, ట్రెజరర్‌గా బమ్మిడి ధర్మారావులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వెలమల అప్పలనాయుడు వ్యవహరించారు. అధ్యక్షులుగా శ్రీనివాస్ ఎన్నిక పట్ల ఉపాధ్యాయులు లఖినేని కరుణాకర్, కిరణ్‌కుమార్‌తో పాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

రణస్థలం: మండలంలోని వల్లభరావుపేటలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో వైసిపి కార్యకర్త కొప్పల రాము, ఆయన కుటుంబ సభ్యులు గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం వారిని పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీనిచ్చారు. ఈయన వెంట మండల మహిళా అధ్యక్షులు మానస తదితరులు ఉన్నారు.

నేడు రైతు సేవా సహకార సంఘ సమావేశం

రణస్థలం రూరల్: రణస్థలం రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ అర్ధ సంవత్సర మహాజన సభ సమావేశాన్ని త్రిసభ్య కమిటీ చైర్మన్ అధ్యక్షతన ఈ నెల 28న నిర్వహిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్. మార్కండేయస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ సభ్యులు, రైతులు సకాలంలో మాజరుకావాలని కోరారు

మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ

పలాస: స్థానిక సామాజిక ఆస్పత్రి ఆవరణలో 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో ఇఎంటిలకు యునైటెడ్ కింగ్డమ్ మాడ్యుల్ అనుగుణంగా శిక్షణ అందించారు. జిల్లా ఎఇఎంఎస్ మేనేజర్ హరిప్రసాద్, ఒఇ జగన్నాథరావు పర్యవేక్షణలో ఆన్‌జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ తరగతులు నిర్వహించారు. అత్యవసర పెడియాట్రిక్ ఎమర్జెన్సీ మెడికల్ వైద్య సేవలు వివరిస్తూ ఇటువంటి పరిస్థితుల్లో ఏ విధంగా ప్రథమ చికిత్స చేయాలో, ఎటువంటి మందులు ఇవ్వాలో అనే వాటిపై క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో టెక్కలి, పలాస, శ్రీకాకుళం డివిజన్‌లో పనిచేస్తున్న 30 మంది ఇఎంటిలు శిక్షణ పొందారు.

కర్బూజా పంపిణీ

ప్రజాశక్తి- కవిటి

పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో ఎండ తీవ్రత దృష్ట్యా బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గ్రామ యువత చివరిరోజు వరకు విద్యార్థులకు దాహార్తి తీర్చింది. ఈ సందర్భంగా పరీక్షలకు చివరి రోజు బుధవారం గ్రామానికి చెందిన డి.జగదీష్, రూప దల్లె, ఆముదాల విశ్వనాథ్ ఆర్థికసాయంతో సుమారు 350 మంది విద్యార్థులకు వంద కేజీల కర్బూజా పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాతలు, గ్రామస్తులు అందించిన సహకారానికి యువత కృతజ్ఞతలు తెలిపారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి



పలాస : మాట్లాడుతున్న వెంకన్న చౌదరి, బాబూరావు

ప్రజాశక్తి- పలాస

పలాస ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, నియోజకవర్గం సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గం పరిధిలో 10వ క్లస్టర్ పరిధిలో బుధవారం నూతన టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిని గెలిపించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు, గురుటి సూరి నారాయణ, పి.విఠల్‌రావు, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్ గుప్త, కుత్తం లక్ష్మణ్ కుమార్, దువ్వాడ సంతోష్ కుమార్, భావన దుర్యోధన పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: టిడిపి విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని క్లస్టర్ ఇన్‌ఛార్జి పుచ్చ ఈశ్వరరావు అన్నారు. గోవిందపురంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి వసంతస్వామి, కార్యదర్శి కర్ని రమణ, గోవింద పాపారావు, కొత్తూరు అప్పారావు, అట్టాడ రఘు, కంబాల దానేసు, చింత యోగేష్, సీపాన గోపి, బాలక గిరి, తామడ కామేష్ పాల్గొన్నారు.

'సూపర్ స్పెషాలిటీ' ప్రారంభం

పలాస : పలాస ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి సాయి శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ రైల్వేగేటు సమీపంలో పాత జాతీయ రహదారిలో కాశీబుగ్గకు చెందిన ప్రముఖ ఎముకల, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ టి.బాలకృష్ణ, స్త్రీ వైద్య నిపుణులు జ్యోత్స్న నూతనంగా నిర్మాణం చేపట్టిన సాయి శ్రీనివాస్ మల్టీ స్పెషాలిటీ అస్పత్రిని బుధవారం మంత్రి ప్రారంభించి మాట్లాడుతూ పలాస ప్రాంత ప్రజలకు మంచి వైద్యాన్ని అందించడానికి ఇటువంటి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు ఉపయోగపడతాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్దాన ప్రాంత ప్రజలకు కిడ్నీ సమస్యలు నుంచి కాపాడేందుకు ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించిందన్నారు. ఎంపీ రామ్మోహన్ నాయుడు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ మెడికల్



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

హబ్‌గా తయారవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు వైద్యం అందించడానికి సాయి శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఎంతో ఉపయోపడుతుందన్నారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, కౌన్సిలర్ పిచ్చుక అజయ్ కుమార్, వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, చినడాం కౌన్సిల్ ప్రతినిధి దువ్వాడ రమణయ్య, అట్టాడ ప్రసన్న కుమార్, డిక్కల నిరంజన్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ జడ్యాడ చంద్రశేఖర్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బలరాముడి పాత్రలో అలరించిన 'బొడ్డేపల్లి'



బలరాముడి పాత్రలో ప్రేక్షకులను అలరిస్తున్న జనార్ధనరావు

ప్రజాశక్తి- ఆముదాలవలస

ప్రపంచ కళాకారుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో నిర్వహించిన శశిరేఖ పరిణయం నాటకంలో బలరాముడి పాత్రలో బొడ్డేపల్లి జనార్దనరావు మాస్టారు ఆలరించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. అభిమన్యుడుగా బగాది శ్రీనివాసరావు, శశిరేఖగా కళ్యాణి, హరిచంద్రుడిగా దువ్వారపు ఎర్రయ్య పాత్రలలో నటించారు. ఆ పాత్రల్లో ఒదిగి నటించడంతో ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారిని అభినందించారు. ప్రపంచ కళాకారుల దినోత్సవ కార్యక్రమం కళాకారుల సంఘ అధ్యక్షుడు టేకి త్రినాథరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ మోహనరావు మాట్లాడుతూ కళాకారులకు పుట్టినిల్లు ఆమదాలవలస అన్నారు. కళాకారుల చిరకాలవాంఛ అయిన ఆడిటోరియం నిర్మాణం కలగానే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. పలు పార్టీల నాయకులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఎవ్వరు స్పందించలేదన్నారు. రాష్ట్ర టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు మాట్లాడుతూ రానురాను కళలు అంతరించి పోతున్నాయని, వాటిని బతికించుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరిపైన ఉందన్నారు. కార్యక్రమంలో కళాకారుల సంఘ ప్రధాన కార్యదర్శి బగాది వెంకటరావు, కోశాధికారి కొంచాడ రామారావు, బంకుపల్లి శ్రీరామచంద్రమూర్తి శర్మ, బుడుమూరు శ్రీనివాసరావు, తమ్మన రామకృష్ణ, రాజా పంతుల రాజు, సైకత శిల్పి గేదెల హరికృష్ణ పాల్గొన్నారు.

కుటుంబ రాజకీయాలకు చరమగీతం పాడాలి

పొందూరు: ఆమదాలవలస నియోజకవర్గం పరిధిలో కుటుంబ రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడాలని స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. పొందూరు మండలం బురిడి కంచరాంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబ రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్న ఇరువురు నాయకులకు రానున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని ఓటర్లను కోరారు. కొన్నేళ్లుగా వారి ఇరువురు పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి పారిశ్రామిక ప్రగతి కుంటుపడిందని, దీనిని ప్రజలందరూ గమనించాలని కోరారు. ఎన్నికల వరకు ప్రత్యర్థులుగా కనిపించి ఆ తరువాత శ్యాండ్, ల్యాండ్, మైన్



ప్రచారం చేస్తున్న గాంధీ

వంటి వాటిలో ఎవరి వాటాలు వారు పంచుకుని లావాదేవీలు సరి చూసుకోవడం వారి నిజ జీవితంలో ఒక భాగమని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వండాన తవిటినాయుడు, పిన్నింటి అప్పలనాయుడు, వండాన సాయిరాం, వాళ్ల రమణ, వాళ్ల అప్పలనాయుడు, రాజారావు, శివ, బాబూరావు, రమణ, గణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుమలేష్

టిడిపి పూర్వ వైభవానికి కృషి

బూర్జ: రాష్ట్రంలో రాక్షస పాలనను అంతం చేసి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పాలన వచ్చేంతవరకు ప్రతిఒక్కరు కృషి చేయాలని టిడిపి బిసి సాధికారిక నగరాల కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మరుపిల్ల తిరుమలేష్ అన్నారు. బుధవారం బూర్జలో ఆయన శ్రీకాకుళం జిల్లా నగరాలతో సమావేశం నిర్వహించారు. ముందుగా టిడిపి బిసి సాధికారిక నగరాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లుగా ఎంపికైన పిల్లా కన్నం నాయుడు, బంక లక్ష్మీనారాయణ నాయుడు, నల్లాన వెంకటకృష్ణ గిరిధర్, వాంద్రాసి అప్పలరాజు, తమ్మిన విమల, ఇలిపిలి వెంకటరావు, పొత్నూరు వెంకటరావు, ఈది సాంబశివరావు, బంక సురేష్ కుమార్, సింహాద్రి నాయుడు, బెవర బానోజీరావు, పోతిన అచ్యుతాంబ, పిల్ల పోలినాయుడులను సభకు పరిచయం చేశారు. అనంతరం తిరుమలేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న నగరాలందరూ టిడిపి అధికారంలోకి వచ్చేవరకు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బిసి సాధికారిత జిల్లా టిడిపి నగరాల కార్పొరేషన్ అధ్యక్షుడు నల్లన వెంకునాయుడు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ మృతి

ప్రజాశక్తి- పలాస



జోగారావు (ఫైల్)

మండలం మోదుగులపుట్టి గ్రామానికి చెందిన మద్దిల జోగారావు (40) ఆర్మీజవాన్ జమ్మూకాశ్మీర్‌లోని దంపూర్ యూనిట్‌లో జెసిఒ క్యాడర్‌గా సోమవారం రాత్రి విధులు నిర్వహిస్తూ అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. అయితే మృతికి గల కారణాలు పూర్తిస్థాయిలో తెలియరాలేదు. జోగారావు మృతదేహాన్ని మిలటరీ అధికారులు పంచనామా నిర్వహించి గ్రామానికి గురువారం చేర్చనున్నట్లు అక్కడి అధికారుల నుంచి సమాచారం కుటుంబ సభ్యులకు అందింది. మృతుడికి భార్య హేమకుమారి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహం చేరిన తరువాత పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలం మలగాం గ్రామానికి చెందిన బుచ్చ గాయత్రి (22) వివాహిత మంగళవారం ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. భార్యాభర్తల మధ్య వాదోపవాదాలు జరిగి క్షణికావేశంలో ఉరివేసుకుని మృతి చెందినట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. సంఘటనపై ఎస్ఐ సిద్ధార్ధ కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. మతురాలకు భర్త (రామన్న) రామారావు, కుమార్తె ఉన్నారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

నందిగాం: మండలంలోని కాపు తెంబూరు రోడ్డులో 953 కేజీల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ కె.మురళీకృష్ణ తెలిపారు. తెంబూరు రోడ్డులో అక్రమముగా టాటా మ్యాజిక్ వాహనంలో తరలిస్తున్న సోంపేటకు చెందిన సానా మనోహర్‌పై 6ఎ కేసు నమోదు చేసినట్లు ఎంఆర్ఐ పి.కిరణ్, విఆర్ఒ తారకేశ్వరరావు తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయునిపై విచారణ

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డుకు చెందిన ఉపాధ్యాయుడు మాధవ బెహరాపై జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు పలాస మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. ప్రజాశక్తి దినపత్రికలో బుధవారం ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయుడు అనే శీర్షికతో వెలువడిన కథనానికి జిల్లా అధికారి స్పందించారు. దీంతో మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ శ్రీనివాసరావు విచారణ చేయగా ఉపాధ్యాయుడు మాధవ బెహరా తల్లి ఇటీవల మృతి చెందడంతో అటువైపుగా వచ్చిన వైసిపి నాయకులు పరామర్శించడానికి వచ్చారని సమీపంలో ఉన్న వార్డు పెద్ద సమావేశం నిర్వహిస్తున్న సమయంలో తన తల్లి కర్మకాండ నిర్వహించేందుకు వెళ్ళగా అదే సమయంలో వైసిపి నాయకులు ఫోటో తీసి హల్‌చల్ చేశారే తప్ప ఉపాధ్యాయుడుకు ప్రచారానికి ఎటువంటి సంబంధం లేదని విచారణలో తేలిందని తెలిపారు.

బంక్‌లో బాంబుల కలకలం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని గూనాలపాడు హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం అర్ధరాత్రి బాంబుల మోతతో అలజడి నెలకొంది. బాంబుల మోతతో పెట్రోల్ బంక్ సంబంధించిన పంపింగ్ మిషన్ ధ్వంసమైంది. అర్ధరాత్రి సమయంలో దుండగులు పంపింగ్ పగలగొట్టి దీపావళి మందుగుండు సామగ్రి అందులో ఉంచి పేల్చినట్లుగా సిసి కెమేరా ఫుటేజ్‌లో గుర్తించినట్లు ఎస్ఐ సిహెచ్ రామారావు తెలిపారు. ఈ ఘటనతో పెద్ద ప్రమాదం బారిన పడేవారమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీపావళి మందుగుండు పేలిన సమయంలో నిప్పురవ్వలు పెట్రోల్, డీజిల్ పంపింగ్ వైరుకి తగిలి ఉంటే ఘోరమైన ప్రమాదం జరిగి ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు. బంక్ యజమానురాలు కొర్ల దేవి మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామారావు, శ్రీకాకుళం క్రైం బృందం ఘటనా స్థలాన్ని పరిశీలించి బంక్ పరిసరాల్లో వేలిముద్రలను సేకరించారు. ఈ ఘటనపై తన అన్నదమ్ములు కొర్ల రవికుమార్, కొర్ల చంద్రశేఖర్ హస్తం ఉన్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హెల్మెట్ ఉపయోగపడుతుందని, ప్రతిఒక్క వాహనదారులు హెల్మెట్ ధరించాలని పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలో బస్టాండ్ జంక్షన్ వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాహన చోదకులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. అనుకోని పరిస్థితుల్లో జరిగే ప్రమాదాల్లో హెల్మెట్ ఉండడం వలన ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డ ప్రాణాలు అనేకం ఉన్నాయని, హెల్మెట్ ధరించాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ బైక్ నడిపితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లుకు తల్లిదండ్రులు వాహనాలు ఇస్తున్నారని ఇది చాలా ప్రమాదకరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

వేసవి పంటలతో నేలకు మేలు

బూర్జ : రబీ సీజన్‌లో మొక్కజొన్న పంట అనంతరం పొలాలను ఖాళీగా ఉంచకుండా వేసవి పంటలు వేయడం వలన భూగర్భ జలాలు ఆవిరి కాకుండా కాపాడవచ్చని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. బుధవారం మండలంలోని ఉప్వపేట, వావాం, తోటవాడ, రామన్నపేట గ్రామాల్లో రైతులకు వేసవి పంట విత్తనాలు ఉచితంగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూతాపం పెరిగి పోతున్న ప్రస్తుత తరుణంలో వేసవిలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదు అవుతున్నాయని, వేసవి దుక్కుల పేరిట నేలను పలుమార్లు దున్నడం వలన నేలలోని తేమ ఆవిరైపోవడమే కాకుండా, నేలలోని ఉపయోగకర సూక్ష్మజీవులు కనుమరుగైపోతాయన్నారు. వేసవిలో పప్పు ధాన్యాలు, నూనె గింజల వంటి ఆచ్ఛాదన పంటల వలన నేలకు పోషకాలు అంది నేల సారవంతం అవుతుందని, అదనపు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి ఏసుబాబు, రైతులు నారాయణ రావు, సింహాద్రి, అప్పలనాయుడు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న తవిటినాయుడు